రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఇద్దరు క్రీడాకారులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఇద్దరు క్రీడాకారులు ఎంపికైనట్లు ఫెన్సింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎం.చంద్ర కళావతి తెలియజేశారు. గురువారం స్థానిక క్రీడా వికాసంలో జిల్లా సీనియర్ జట్టు ఫెన్సింగ్ ఎంపికలు నిర్వహించారు. మద్దూరి సురేష్, కంతూరి లోకేష్ రాయల్ ఎంపికయ్యారనియ తెలిపారు. వీరు ఈ నెల 10, 11వ తేదీలలో కాకినాడలోని ద్రోణ అకాడమీలో రాష్ట్ర స్థాయి పోటీలలో ఫెన్సింగ్ ఫాయిల్ విభాగంలో పాల్గొంటారని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ఎంపికైన వారు జాతీయ స్థాయి పోటీలలో పాల్గొనడానికి అర్హత సాధిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కెవికె శాప్ కోచ్ హరికృష్ణంరాజు, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ మురళీకృష్ణారెడ్డి, ప్రతినిధి రామాంజనేయులు పాల్గొన్నారు.

ఫెన్సింగ్ పోటీని ప్రారంభిస్తున్న ప్రతినిధులు

రేపటితో ప్రచారానికి తెర

- ఎత్తుగడల్లో ఎమ్మెల్సీ అభ్యర్థులు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారానికి శనివారం తెరపడనుంది. గత నెల తొమ్మిది నుంచి ఆద్యంతం పోటాపోటీగా నడిచింది. పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ స్థానానికి పట్టభద్ర, ఉపాధ్యాయ, స్థానిక సంస్థల తరుపున ఎమ్మెల్సీ ఎన్నికలకు నిర్వహణకు జిల్లా అధికార యంత్రాంగం కసరత్తు చేసింది. ఎన్నికల షెడ్యూల్ అమలుపరిచింది. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పి.రామ సుబ్బారెడ్డి ఏకగ్రీవం కావడం దగ్గర నెలకొన్న హైడ్రామా మొదలుకుని శనివారం సాయంత్రానికి ముగియనున్న ఎన్నికల వ్యవహారం ఉత్కంఠను కలిగించింది. ఎన్నికల ప్రచారం ముగియనున్న నేపథ్యంలో ఏజెంట్ల నియామకం, ఓటింగ్ పోలరైజేషన్ వంటి వ్యూహాల్లో ఎవరు పైచేయి సాధిస్తారో వేచి చూడాల్సి ఉంది. జిల్లాలో పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ ఎన్నికల వ్యవహారం క్లైమాక్స్ చేరుకుంది. గత తొమ్మిదిన ఎన్నికల నగారా మోగిన దగ్గర నుంచి నేటి వరకు ఎన్నికల ప్రచారం ఎన్నో మలుపులు తీసుకుంది. ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో 39 మంది పట్టభద్ర, 12 మంది ఉపాధ్యాయ అభ్యర్థులు బరిలో దిగిన సంగతి తెలిసిందే. ఉమ్మడి కడప, కర్నూలు, అనంతపురం జిల్లాలోని 27,716 మంది ఉపాధ్యాయ, 3,51,700 మంది పట్టభద్ర ఓటర్ల దృష్టిని ఆకట్టుకోవడానికి ఎమ్మెల్సీ బరిలో దిగిన ఆశావహులు వ్యూహాత్మకంగా ఎన్నికల ప్రచారం సాగించారు. అధికార వైసిపి మద్దతుదారులు ప్రయివేటు స్కూళ్ల యాజమాన్యాలతో ఆత్మీయ సమ్మేళనాలు, ప్రతిపక్ష పార్టీల మద్దతుదారుల మద్దతుగా పరిశీలకుల నియామకం, వరుస సమీక్షా సమావేశాల నిర్వహణ, పిడిఎఫ్ అభ్యర్థులు ఉపాధ్యాయ, ప్రజాసంఘాల మద్దతుతో హోరాహోరీగా ఎన్నికల ప్రచారాన్ని సాగించాయి.

చేనేతలను ఆదుకుంటాం

చేనేతల సదస్సులో మాట్లాడుతున్న నారా లోకేష్

- 500 కిలోమీటర్లు చేరుకున్న పాదయాత్ర
- ఇరిగేషన్ ప్రాజెక్టులపై శ్రద్ధ లేని ప్రభుత్వం
- టమోటా ప్రాసెసింగ్, కోల్డ్‌స్టోరేజ్‌కు కృషి
- పాదయాత్రలో లోకేష్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

చేనేత కార్మికులను జగన్ ప్రభుత్వం మోసం చేసిందని, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే వారిని ఆదుకుంటామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ విమర్శించారు. యువగళం పేరుతో లోకేష్ చేపట్టిన పాదయాత్ర 39వ రోజుకు చేరుకుంది. గురువారం అన్నమయ్య జిల్లా మదనపల్లె నియోజకవర్గంలోని పూల వాండ్లపల్లి నుంచి ప్రారంభమైన పాదయాత్ర సిటిఎం-1, సిటిఎం-1 క్రాస్, సిటిఎం-2, కొత్త వారిపల్లె, ఎనుములవారిపల్లె, తురకపల్లి, వెంకటప్పకొండ, తట్టివారిపల్లె దేవతానగర్ వరకూ పాదయాత్ర సాగింది. చిన్నతిప్పసముద్రం-2 వద్దకు పాదయాత్ర 500 కిలోమీటర్లకు చేరుకుంది. గుర్తుగా శిలాఫలకాన్ని లోకేష్ ఆవిష్కరించారు. దేవతానగర్ వద్ద విడిది కేంద్రంలో బస చేశారు. అక్కడే పలువురు టిడిపిలో చేరారు. పాదయాత్ర సందర్భంగా ఆయా ప్రాంతాల్లో స్థానికులతో మాటామంతి, చేనేతలతో సమావేశం, మైనార్టీలు, టిడ్కో గృహాల బాధిత లబ్ధిదారులతో భేటీ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. చిత్తూరు జిల్లా బ్రహ్మణ సేవా సంఘం, బోయ, వాల్మీకి, పాలేఏకిరి సామాజిక వర్గం ప్రతినిధులు నాయకులు, రైతులు కలిసి తమ సమస్యలు వివరించారు. పాదయాత్ర సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా నేతన్నలకు గుర్తింపు కార్డులు అందజేసిన ఘనత టిడిపిదేనన్నారు. జగన్ పాలన వచ్చిన తరువాత కనీసం చేనేత కార్మికులకు గుర్తింపు కార్డులు ఇచ్చే దిక్కు లేదన్నారు. పవర్ లూమ్ వస్త్రాలు, చేనేత వస్త్రాలకు తేడా తెలిసేలా లేబిలింగ్ చేయాల్సిన అవసరం ఖచ్చితంగా ఉందని తెలిపారు. అప్పుడే నేతన్న కష్టానికి తగిన ఫలితం వస్తుందని చెప్పారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే చేనేతకు ఒక ప్రత్యేక బ్రాండ్ క్రియేట్ చేసి మార్కెట్ లింకేజ్ ద్వారా అధిక ఆదాయం వచ్చేలా చేస్తామని పేర్కొన్నారు. 60 మంది చేనేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకుంటే ఒక్క కుటుంబానికి కూడా న్యాయం జరగలేదని తెలిపారు. ఆప్కో ద్వారా చేనేత వస్త్రాల కొనుగోలు జరగడం లేదన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే బీమా, వడ్డీ లేని రుణాలు ఇస్తామన్నారు. గత టిడిపి ప్రభుత్వంలో బ్రాహ్మణ కార్పొరేషన్‌కు భారీగా నిధులు కేటాయించడమేగాక పేద బ్రాహ్మణులకు అండగా ఉండటానికి అనేక పథకాలను ప్రవేశపెట్టామని పేర్కొన్నారు. జగన్ అధికారంలో వచ్చాక అన్నింటినీ రద్దుచేస్తూ రద్దుల ముఖ్య మంత్రిగా పేరుతెచ్చుకున్నారని తెలిపారు. పేద బ్రాహ్మణుల సమస్యలపై అవగాహన ఉందని, టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. వాల్మీకి, బోయలకు రాజకీయంగా పెద్దపీట వేసింది తెలుగుదేశం పార్టీనేనన్నారు. జగన్ బిసి కులాల వారందరినీ మోసగించాడన్నారు. వాల్మీకి/బోయలకు న్యాయం చేస్తామనీ, వారి సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తామని తెలిపారు. వైసిపి ప్రభుతం కులానికొక కార్పొరేషన్ ఏర్పాటు చేసి కనీసం కుర్చీ కూడా ఇవ్వకుండా బిసిలను తీవ్రంగా అవమానిస్తున్నారు. రాయలసీమలో అధికంగా ఉన్న పాలఏకిరి విద్యార్థుల కోసం ప్రత్యేక హాస్టల్ సౌకర్యం కల్పించే అంశాన్ని పరిశీలిస్తామన్నారు. వ్యవసాయ కూలీలుగా జీవిస్తున్న పాలఏకిరిలకు చిరువ్యాపారాలు చేసుకోవడానికి బ్యాంకు రుణాలు ఇప్పించి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. జగన్ దోచుకోవడం దాచుకోవడంపై ఉన్న శ్రద్ధ రాయలసీమలో ప్రాజెక్టులపై లేదన్నారు. రాయలసీమలో సాగునీటి ప్రాజెక్టుల కోసం టిడిపి ప్రభుత్వ హయాంలో రూ.13 వేల కోట్లు ఖర్చుచేస్తే, వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కేవలం రూ.వెయ్యి కోట్లు మాత్రమే ఖర్చుచేసిందని గుర్తుచేశారు. హంద్రీ-నీవాకు సంబంధించి గత ప్రభుత్వంలో 80 శాతం పనులు పూర్తిచేయగా, మిగిలిన 20 శాతం పూర్తిచేయడం ఈ చేతగాని సిఎం వల్లకాలేదన్నారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే హంద్రీ-నీవా పనులు పూర్తిచేస్తామని తెలిపారు.

కట్టుదిట్టంగా ఇంటర్ పరీక్షలు

ప్రజాశక్తి-రాయచోటి

ఈ నెల 15వ తేదీ నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు జరిగే ఇంటర్మీడియట్ పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాటు చేసినట్లు జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అధికారి ఎం.కృష్ణయ్య పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లో ఆర్టీసీ, పోస్టల్ డిపార్ట్మెంట్, పోలీస్, రెవెన్యూ, ఎలక్ట్రిషన్‌లతో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 52 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు 13,934, రెండవ సంవత్సరం విద్యార్థులు 14,446 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని తెలిపారు. పరీక్ష ఉదయం ఉదయం 9 గంటల నుండి 12 వరకు పరీక్షలు నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు 30 నిమిషాల ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని పేర్కొన్నారు. ఒక్క నిమిషం ఆలస్యమైన విద్యార్థులను అనుమతించమన్నారు. కేంద్రాల పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. పరీక్ష సెంటర్ల వద్ద జిరాక్స్ షాపులు కూడా మూసివేస్తున్నామన్నారు. పరీక్ష కేంద్రాలలో సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రయివేట్ కాలేజీలలో పనిచేసే లెక్చలర్లు, ప్రభుత్వ కాలేజీలో గెస్ట్ ఫ్యాకల్టీలను ఇన్విజిలేటర్లకు తీసుకోకూడదన్నారు. ప్రభుత్వ కాలేజీలో రెగ్యులర్‌గా పనిచేసే వారిని మాత్రమే ఇన్విజిలేటర్లుగా తీసుకోవడం జరుగుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఫ్లెయింగ్ సబ్ స్క్వాడ్ 4, సిట్టింగ్స్ స్క్వాడ్ 10, హెచ్‌పిసి స్క్వాడ్ 1, డిఐఒ పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఎక్కడ కూడా మాస్ కాపీ జరగకుండా సీసీ కెమెరా నిఘాలో ఇంటర్మీడియట్ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. సెంటర్లో వద్ద విద్యార్థుల కోసం ఎఎన్ఎంలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. విద్యార్థులు కోసం సెంటర్ల వద్ద మౌలిక వసతులు ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందన్నారు. ఇంటర్మీడియట్ పరీక్షలు పగడ్బందీగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు.

సెమిస్టర్ ఫలితాల్లో 'సాయి' విద్యార్థుల ప్రభంజనం

రాయచోటి : యూనిర్శిటీ విడుదల చేసి మూడవ సంవత్సరం ఇంజినీరింగ్ మొదటి సెమిస్టర్ ఫలితాల్లో శ్రీసాయి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపరి అత్యుత్తమ ఫలితాలు సాధించారని విద్యా సంస్థల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.సుధాకర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగంలో వై.హర్షిత 86.4 శాతంతో మొదటి ర్యాంకు, జి.హర్షిత 83.2 శాతంతో రెండవ ర్యాంకు, ఎ.వెన్నెల 83.1 శాతం తో మూడవ ర్యాంకు, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం నుంచి ఎం.పార్వతి ప్రియ 89.66 శాతంతో మొదటి ర్యాంకు ఎస్.తబుసం 88.44 శాతంతో రెండవ ర్యాంకు ఎస్.సైదా సుల్తానా 88.22 శాతంతో మూడవ ర్యాంకు సాధించి యూనివర్సిటీ స్థాయిలో అగ్రగామిగా నిలిచారని పేర్కొన్నారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థులను ఫలితాల సాధనలో భాగమైన అధ్యాపకులను అభినందిస్తూ, ప్రతి ఒక్కరికీ ఉద్యోగ ఉపాధి భరోసా కల్పించడానికి మౌలిక వసతులు కల్పిస్తున్నామని వివరించారు. వీరిని ఆదర్శంగా తీసుకుని మిగిలిన విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని దిశానిర్దేశం చేశారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.బాలాజీ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగాధిపతి శుభహాన్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగాధిపతి డాక్టర్ ఎ.కార్తికేయన్, అధ్యాపకులు అభినందించారు.

మన అరటి.. ఎంతో మేటీ!

- విదేశాలకు కడప అరటి ఎగుమతులు
- టన్ను ధర రూ.25 వేలు

ప్రజాశక్తి - చాపాడు

మన ప్రాంత అరటి అంతర్జాతీయ మార్కెట్‌లోనూ సత్తా చాటుతోంది. ఎగుమతులను పెంచుకుంటూ రైతులకు భరోసా కల్పిస్తోంది. ఎగుమతులను మరింతగా ప్రోత్సహించాలన్న రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం మేరకు డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన యూనివర్సిటీ కొనుగోలుదారులు, అమ్మకందారులతో ఇప్పటికే ఒక వేదికను ఏర్పాటు చేసింది. ఈ ఏడాది రికార్డు స్థాయిలో 35 వేల టన్నుల అరటి పండ్లను ఎగుమతి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ నిర్ణయంతో రానున్న రోజుల్లో అరటి సాగుదారులకు మరింత ప్రయోజనం కలగనుంది. రాష్ట్రంలో 63.84 లక్షల టన్నుల అరటి పండ్లు ఉత్పత్తి అవుతుండగా.. ఇందులో ఒక్క వైఎస్సార్ కడప జిల్లా నుంచే 23,15,300 టన్నుల దిగుబడి వస్తోంది. ఒక్క పులివెందులలోనే 1,100 హెక్టార్లలో అరటి సాగవుతుండగా ఇక్కడి పంటకు అంతర్జాతీయంగా మంచి గుర్తింపు కూడా లబిస్తున్నది. సాధారణంగా అరటి పండ్లు 6, 7 రోజులు మాత్రమే నిల్వ ఉంటాయి. మన జిల్లాలో సాగు అయ్యే పండ్లు 14 రోజుల వరకు నిల్వ ఉంటున్నాయని రైతులు, వ్యాపారులు పేర్కొంటున్నారు. టిష్యూకల్చర్ వచ్చాక పండ్లలో నాణ్యత పెరిగిందని సూచిస్తున్నారు. కడప జిల్లాలో సాగైయ్యే అరటిలో 80 శాతం చెన్నై, బెంగళూరు నగరాలకు ఎగుమతి అవుతున్నాయి. రాష్ట్రంలో 1,12,995 హెక్టార్లలో అరటి సాగవుతోంది. ఏటా 63,84,730 టన్నుల అరటి పండ్లు ఉత్పత్తి అవుతున్నాయి. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, కడప, కర్నూలు, అనంతపురం జిల్లాల్లో అరటి సాగవుతుండగా విస్తీర్ణం, ఉత్పత్తిలో కడప ప్రథమ స్థానంలో ఉంది. కడప జిల్లాలో పులివెందుల, మైదుకూరు, బద్వేలు నియోజకవర్గంలో అధికంగా అరటి సాగు అవుతున్నది. మధ్య ప్రాచ్య దేశాలైన యూఏఈ, బెహ్రాయిన్, ఈజిప్ట్, సౌదీ అరేబియా, ఖతార్, ఇరాన్ దేశాల్లో మన అరటికి మంచి డిమాండ్ ఉంది. గ్రీన్ కావెండిష్ ప్రీమియమ్ రకాలు ఆ దేశాలకు ఎగుమతి అవుతున్నాయి. 2016-17లో 246 టన్నుల అరటి పండ్లు ఎగుమతి కాగా, 2017-18లో 4,300 టన్నులు, 2018-19లో 18,500 మెట్రిక్ టన్నులకు ఎగుమతులు పెరిగాయి. ఈ ఏడాది రికార్డు స్థాయిలో 35 వేల మెట్రిక్ టన్నుల అరటి పండ్లను ఎగుమతి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. సాగు విస్తీర్ణాన్ని పెంచడంతోపాటు మార్కెట్‌ను విస్తరించేందుకు వీలుగా డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఈ ఏడాది కడప జిల్లా పులివెందులలో అరటి పరిశోధనా కేంద్రం ఏర్పాటుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇటీవల శంకుస్థాపన చేశారు. దీని కోసం ప్రభుత్వం 70 ఎకరాల భూమిని, పరిశోధనల కోసం 628 ఎకరాల భూమిని కేటాయించింది.

అరటి తోట

ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసేందుకు అరటి కాయలను లారీకి లోడ్ చేస్తున్న కూలీలు

ఇతర రాష్ట్రాలకూ ఆంధ్రా అరటి....

కోస్తా, రాయలసీమలో పండించే అరటి ఇతర రాష్ట్రాలకు సైతం వెళ్తుంది. ఢిల్లీ, రాజస్థాన్, ఒడిశా, బెంగాల్, బిహార్ రాష్ట్రాలకు ఆంధ్రాలో పండించే అరటిని తరలిస్తున్నారు. అక్కడి నుంచి ఇతర దేశాలకు కూడా ఎగుమతి చేస్తామని అరటి హెూల్ సేల్ వ్యాపారులు సూచిస్తున్నారు. కడప జిల్లాలో సాగయ్యే అరటి మంచి నాణ్యతతో ఉండటంతో దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లో దీనికి బాగా డిమాండ్ ఉంది. మార్కెట్ సీజన్ల వారీగా ఉంటుంది. జులై నుంచి నవంబర్ వరకూ రేటు బాగా పలుకుతుంది. వేసవిలో మార్కెట్ సాధారణంగా ఉంటుంది. విదేశాలకు ఎగుమతిని చేసే అరటికి సాగు దశలోనే జాగ్రత్తలు తీసుకోవాలి. అందుకు తగినట్లుగా ఏపీ రైతులు వ్యవహరిస్తున్నారు. సౌదీ, దుబాయ్ వంటి దేశాలకు అరటి ఎగుమతులు మరింత పెరిగే అవకాశం ఉంటుదని వ్యాపారులు పేర్కొంటున్నారు.

సబ్సిడీలు దక్కడం లేదు..

అరటి సాగు చేసే వారిలో సాధారణ రైతాంగం ఎక్కువగా ఉంటున్నారు. అయితే ప్రభుత్వాలు అందిస్తున్న సబ్సిడీలు, వివిధ పథకాలు, కోల్డ్ స్టోరేజ్ నిర్మాణాలకు, ఇతర ఎగుమతిదారులకు ఉపయోగపడుతున్నాయి తప్ప సామాన్య రైతులకు పెద్దగా ప్రయోజనం దక్కడం లేదని రైతులు పేర్కొంటున్నారు. పెట్టుబడి ఖర్చులు బాగా పెరిగినట్లు రైతులు చెబుతున్నారు. అరటి పంట వాతావరణ మార్పుల మీద ఆధారపడి ఉంటుందని, గాలుల తీవ్రత ఎక్కువైతే పంట మీద ఆశలు వదులుకోవాల్సిందే అంటున్నారు. పంట కాపాడుకోవడానికి కట్టెల సాయంతో మొక్కను నిలబెట్టుకోవాల్సి వస్తుందని, కానీ కష్టపడి పండించిన తర్వాత ధరలు గిట్టుబాటు కావడం లేదని ప్రభుత్వమే పంట కొనుగోలు చేసి ఎగుమతి చేస్తే ఉపయోగంగా ఉంటుదని, సబ్సిడీలు ఇచ్చి, పంటకి మార్కెట్ కల్పిస్తే అరటి రైతుకి ధోకా ఉండదని అని రైతులు అభిప్రాయపడుతున్నారు.

పెరుగుతోన్న అరటి పంట విస్తీర్ణం..

ఎగుమతులతో విదేశాల్లో ఆంధ్ర అరటికి డిమాండ్ కనిపిస్తోంది. అయితే సాధారణ రైతుకి మరింత తోడ్పాటు అవసరమనే అభిప్రాయం వినిపిస్తోంది. అది జరిగితే అరటి సాగులో కడప రైతులు మరింత ముందుకు వెళ్లే అవకాశం ఉంది.

రాములోరి బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

- పోస్టర్ ఆవిష్కరణలో టిటిడి ఇఒ ధర్మారెడ్డి

ప్రజాశక్తి-ఒంటిమిట్ట

టిటిడిలోని అన్ని విభాగాలు, జిల్లా యంత్రాంగం, పోలీసులు సమష్టి కృషి చేసి ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని టిటిడి ఇఒ ఎవి.ధర్మారెడ్డి అధికారులను కోరారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై వైఎస్ఆర్ జిల్లా కలెక్టర్ విజయరామరాజు, జిల్లా ఎస్‌పి అన్బురాజన్, జిల్లా యంత్రాంగంతో గురువారం ఒంటిమిట్టలో ఇఒ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఇఒ మాట్లాడుతూ గతంలో జరిగిన లోటుపాట్లను సవరించుకుని శ్రీ సీతారాముల కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించాలన్నారు. టిటిడి, జిల్లా అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయం చేసుకుని బ్రహ్మోత్సవ ఏర్పాట్లను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ నెల 16వ తేదీ మరోసారి పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ నెల 30వ తేదీ శ్రీరామనవమితో స్వామివారి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. ఏప్రిల్ 3వ తేదీ హనుమంత వాహనం, ఏప్రిల్ 4వ తేదీ గరుడవాహనం, ఏప్రిల్ 5వ తేదీ సీతారాముల కల్యాణాన్ని అత్యంత అద్భుతంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. శ్రీ సీతారాముల కల్యాణానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పిస్తారని తెలిపారు. ఏప్రిల్ 6న రథోత్సవం, ఏప్రిల్ 8న చక్రస్నానం, ఏప్రిల్ 9న పుష్పయాగము జరుగుతాయని చెప్పారు. వైఎస్ఆర్ జిల్లా కలెక్టర్ విజయరామరాజు మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల్లో ప్రధానంగా శ్రీ సీతారాముల కల్యాణానికి విచ్చేసిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జిల్లా యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేపట్టనున్నట్లు తెలిపారు. భద్రత, పార్కింగ్, అన్నప్రసాదాల పంపిణీ, తాత్కాలిక మరుగుదొడ్లు, నిరంతర విద్యుత్ సరఫరా, ప్రథమ చికిత్స కేంద్రాలు, ఆర్టీసీ బస్సులు, హెల్ప్ డెస్కులు, సైన్ బోర్డులు, పారిశుధ్యం, పబ్లిక్ అడ్రస్ సిస్టం విభాగాలు ఈ నెల 16వ తేదీలోపు తమ కార్యాచరణ ప్రణాళికలను అందించాలన్నారు. అంతకుముందు టిటిడి ఇఒ, వైఎస్ఆర్ జిల్లా కలెక్టర్‌తో కలిసి శ్రీ కోదండరామ స్వామి బ్రహ్మోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో టిటిడి జెఇఒ వీరబ్రహ్మం, వైఎస్ఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ సాయి కాంత్‌వర్మ, డిఆర్ఒ గంగాధర్, ఎస్‌విబిసి సిఇఒ షణ్ముఖ కుమార్, టిటిడి సిఇ నాగేశ్వరరావు, కడప ఆర్‌డిఒ ధర్మచంద్రారెడ్డి, ఒఎస్‌డి రఘునాథ్, డ్వామా, డిఆర్‌డిఎ పీడీలు యదుభూషన్‌రెడ్డి, ఆనంద్ నాయక్, డిఎస్‌పి శివారెడ్డి, వ్యవసాయ శాఖ జెడి నాగేశ్వరరావు, సమగ్ర శిక్ష ఎపిసి ప్రభాకర్‌రెడ్డి, డిఎంహెచ్ఒ డాక్టర్ నాగరాజు, సిపిఒ వెంకటరావు, డిపిఒ ప్రభాకర్‌రెడ్డి, జెడ్పీ సిఇఒ సుధాకర్‌రెడ్డి, పంచాయతీ రాజ్ ఎస్ఇ శ్రీనివాస్‌రెడ్డి, విద్యుత్ ఎస్ఇ మునిశంకరయ్య, డిటిసి మీరాప్రసాద్, ఆర్టీసీ ఆర్ఎం ప్రసాద్ రెడ్డి, టిటిడి పిఆర్ఒ రవి, సమాచార శాఖ ఎడి వేణుగోపాల్‌రెడ్డి, ప్రత్యేక ప్రతిభావంతుల శాఖ ఎడి కృష్ణకిషోర్, ఎపిఎంఐపి పీడీ రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న టిటిడి ఇఒ, కడప కలెక్టర్

ఎసిబికి చిక్కిన విఆర్ఒ

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

రూ.ఐదు వేలు లంచం తీసుకుంటూ మాధవంర విఆర్ఒ పఠాన్ రహమత్‌ఖాన్ కడప ఎసిబి అధికారులకు గురువారం చిక్కారు. కాటినేనివారివల్లెకు చెందిన కె.నీలావతి తన పొలంలో ఉన్న సర్వే నెంబర్ 575లోని వ్యవసాయ భూమిని మ్యుటేషన్ ఆన్‌లైన్, పట్టాదారు పాసుపుస్తకం కోసం రూ.ఐదు వేలు ఇవ్వాలని విఆర్ఒ డిమాండ్ చేశారు. ఇవ్వకపోతే పని జరుగదని తేల్చి చెప్పాడు. బాధితురాలు చేసేది లేక ఎసిబి అధికారులను సంప్రదించింది. ఎసిబి అధికారుల సూచనల మేరకు సచివాలయంలో రహమత్ ఖాన్ నుంచి రూ.5 వేలు లంచం తీసుకుంటుండగా కడప ఎసిబి డిఎస్‌పి కంజాక్షన్ తన సిబ్బందితో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ సంద్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా ప్రభుత్వ అధికారులు సిబ్బంది ప్రజలను పనుల నిమిత్తం డబ్బులు డిమాండ్ చేసినట్లయితే వెంటనే 14400 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎసిబి సిఐ ఏలమరాజు, కృష్ణమోహన్, నరేష్, ఎస్ఐ నౌషాద్ అలీ భాష సిబ్బంది పాల్గొన్నారు.

విఆర్ఒ రహమత్‌ఖాన్

చిన్నారుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి : కలెక్టర్

ప్రజాశక్తి-రాయచోటి

చిన్నారుల ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ గిరీష సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో 'జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం'పై సంబంధిత అనుబంధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 14 వ తేదీన 'జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం' నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఒక సంవత్సరం నుండి 19 ఏళ్ల వయసు గల పిల్లలు 3,82,804 మంది ఉన్నారన్నారు. వీరందరికీ ఈ నెల 14వ తేదీన అల్బెన్డజోల్ 400 మీల్లీ గ్రాముల మాత్రలు తప్పకుండా మింగించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా డీ వార్మింగ్ డేను ఈనెల 14వ తేదీన నిర్వహించడం జరుగుతుందని జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, డిగ్రీ కళాశాలలు, పాలిటెక్నిక్, నర్సింగ్ జూనియర్ కళాశాలలలో ఉన్న 1 నుండి 19 సంవత్సరాల లోపు పిల్లలకు అల్బెన్డజోల్ 400మీ.గ్రా మాత్రలు మధ్యాహ్నం భోజనం అనంతరం పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. డ్రాపౌట్స్ మరియు 14వ తేదీన మాత్రలు తీసుకోని వారి కొరకు ప్రత్యేకంగా 18వ తేదీన మాప్ అప్ డే నిర్వహిస్తామన్నారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం కొరకు, రక్తహీనత లేని సమాజ స్థాపనకు ప్రతీ సంవత్సరం రెండు దఫాలు డీ వార్మింగ్ డే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. అల్బెన్డజోల్ 400 మీ.గ్రా మాత్రలు రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమంలో ఒకటి నుండి 19 సం లోపు పిల్లలు అందరికీ ఉచితంగానే అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలలో ,అంగన్వాడీ కేంద్రాలలో పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. విద్యార్థులలో రక్తహీనత నివారణ చర్యలు చేపట్టడం వల్ల వ్యాధినిరోధక శక్తి పెరగడంతో పాటు,మానసిక, శారీరక పెరుగుదల ఉంటుందన్నారు. ముఖ్యంగా కిశోర బాలికలకు ఐరెన్ అత్యంత అవసరమని అందుకే "రక్తహీనత రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. భవిష్యత్ తరాల పిల్లల ఆరోగ్యం కోసం నిర్వహించే జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం కార్యక్రమంలో అందరూ భాగ్యస్వాములై విజయవంతం చేయాలని, చిన్నారుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించడం మనందరి బాధ్యత అన్నారు. ఉపాధ్యాయులు ఈ మాత్రలను మధ్యాహ్న భోజన అనంతరం ఉపాధ్యాయుల సమక్షంలో పిల్లల చేత చప్పరించి మింగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలలో ఉన్న 1-2 సంవత్సరాల వయస్సు పిల్లలందరికీ అర్ధ మాత్రను 3-5 సంవత్సరాల వయస్సు పిల్లలందరికీ ఒక మాత్రను ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మండలాలలో ఎంపీడీవోలు, మండల విద్యాశాఖ అధికారులు మెడికల్ ఆఫీసర్లు, ఆశ వర్కర్లు, ఏఎన్ఎంయూలు, అందరూ అధికారులు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు.చిన్నారుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించడం మన అందరి బాధ్యతని కలెక్టర్ గుర్తు చేశారు. అనంతరం జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం గోడ పత్రికలను కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కొండయ్య, డిసిహెచ్ఎస్ డాక్టర్ చంద్రశేఖర్, జిల్లా రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమ అధికారి డాక్టర్ శేషగిరి బాబు, ఎన్.డి.డి.కార్యక్రమ జిల్లా సమన్వయ కర్త ఇంతియాజ్, బిసి వెల్ఫేర్ హాస్టల్ డిప్యూటీ డైరెక్టర్, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డిడి జాకీర్ హుస్సేన్, జిల్లా జూనియర్ కళాశాల ప్రిన్సిపల్, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్, హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ గిరీష

'బ్యాలెట్ బాక్సుల రవాణా పకడ్బందీగా చేపట్టాలి'

ప్రజాశక్తి-రాయచోటి

ఈ నెల 13వ తేదీ జరిగే పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి రిసెప్షన్ సెంటర్ నుంచి పోలింగ్ కేంద్రాలకు బ్యాలెట్ బాక్సల రవాణా పగడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ గిరీష సంబంధిత అధికారులకు సూచించారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయ ఆవరణంలో బ్యాలెట్ బాక్సలు, జంబో బాక్సలు ఓపెన్, క్లోజ్ చేయడం, బ్యాలెట్ బాక్స ట్రాన్స్పోర్టేషన్‌పై అధికారులకు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పట్టబద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అన్నమయ్య జిల్లాలో 16 రూట్లు ఉన్నాయన్నారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి పోలింగ్ స్టేషన్‌లకు బ్యాలెట్ బాక్సులు పగడ్బందీగా తరలించాలన్నారు. పోలింగ్ పూర్తయిన తర్వాత బ్యాలెట్ బాక్సులు, జంబో బాక్సలకు పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో జాగ్రత్తగా సీల్ వేయాలన్నారు. ప్రతి బ్యాలెట్ బాక్స్ కు సీరియల్ నెంబర్, పోలింగ్ స్టేషన్ వివరాలు తప్పకుండా ఉండాలన్నారు.బ్యాలెట్ బాక్సలు ఓపెన్, క్లోజ్ చేయడంపై పోలింగ్ అధికారులు సిబ్బంది పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ సందర్భంగా ఆర్టీసీ పల్లె వెలుగు బస్సులో జంబో బాక్సులు ట్రాన్స్పోర్టేషన్ గురించి సంబంధిత అధికారులకు వివరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారీయా, డిఆర్ఒ సత్యనారాయణ, ఎన్నికల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

వెబ్ కాస్టింగ్‌లో పొరపాట్లకు తావివ్వరాదు : డిపిఒ

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలో ఈ నెల 13వ తేదీన జరగనున్న పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి కలెక్టర్ ఆదేశాల మేరకు వెబ్ కాస్టింగ్‌పై శిక్షణ కార్యక్రమంలో భాగంగా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా వెబ్ కాస్టింగ్ ప్రక్రియ నిర్వహించేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డిపిఒ ధనలక్ష్మి ఇంజినీరింగ్ విద్యార్థులకు సూచించారు. గురువారం మధ్యాహ్నం స్థానిక సాయి ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి వెబ్ కాస్టింగ్ ప్రక్రియపై ఇంజినీరింగ్ విద్యార్థులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి చేపట్టాల్సిన వెబ్ కాస్టింగ్ ప్రక్రియపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించుకొని పోలింగ్ రోజున ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా వెబ్ కాస్టింగ్ ప్రక్రియను నిర్వహించాలన్నారు. వెబ్ కాస్టింగ్ ప్రక్రియలో పాల్గొను ప్రతి విద్యార్థి స్వఛ్ఛరేదంగా ఎన్నికల నిర్వహణలో పాల్గొనటం సంతోషకరమని, కేంద్ర ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా పోలింగ్ మొదలు అయినప్పటి నుండి పూర్తి అయ్యేంతవరకు వెబ్ కాస్టింగ్ ప్రక్రియ చేపట్టాల్సి వుంటుందన్నారు. వెబ్ కాస్టింగ్ నిర్వహణపై ఈ రోజు ఏర్పాటుచేసిన శిక్షణా కార్యక్రమంలో వెబ్ కాస్టింగ్ ప్రక్రియపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించుకొని ప్రతి విద్యార్థి బాధ్యతతో వెబ్ కాస్టింగ్ విధులు నిర్వర్తించాలని సూచించారు. కార్యక్రమంలో సాయి ఇంజినీరింగ్ కళాశాల సహాయక డైరెక్టర్ సుధాకర్‌రెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ క్రాంతి కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ జులేఖబేగం

కెజిబివి విద్యార్థులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మండల పరిధిలోని ముష్టూరు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినిలకు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జులేఖబేగం వైద్య పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు పాఠశాలలోని విద్యార్థినిల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రతినెల రెండు సార్లు వైద్య పరీక్షలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పాఠశాలలోని 230 మంది విద్యార్థినిలకు సాధారణ వైద్య పరీక్షలు చేశామన్నారు. వీరిలో కొంతమంది విద్యార్థినిలకు అవసరమైన మందులను పంపిణీ చేసినట్లు చెప్పారు. గ్రామంలో కుటుంబ వైద్యుడి విధానంలో భాగంగా 104 వాహనం ద్వారా వైద్య శిబిరాన్ని నిర్వహించి ప్రజలకు వైద్య పరీక్షలు చేసి మందులను పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కెజిబివి ప్రిన్సిపల్ ముని వెంకటమ్మ, ఎంఎల్‌హెచ్‌పి సంధ్య, ఎఎన్ఎం ఆబిధా, సూపర్వైజర్ దేవకుమారి, రమాదేవి పాల్గొన్నారు.

నేడు తవళం చెరువులకు వేలం

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

చేపల ఫలసాయానికై తవళం గ్రామంలోని చెరువులకు శుక్రవారం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు సర్పంచు కడపల రెడ్డప్ప తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తవళం గ్రామంలో ఉన్న ఎగువ చెరువు, గంగాసాగర్ ఒడ్డు, సాకిరేవు ఒడ్డు, ఎర్రమరెడ్డి చెరువులకు స్థానిక సచివాలయం వద్ద ఉదయం 10.30 గంటలకు ఎంపిడిఒ లీలా మాధవి ఆధ్వర్యంలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు ముందుగా డిపాజిట్ రుసుం చెల్లించి వేలంపాటలో పాల్గొని చెరువులను దక్కించుకోవాలని తెలిపారు.

వైభవంగా లక్ష్మీ నరసింహస్వామి తిరుణాల

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండల పరిధిలోని కుక్కరాజుపల్లెలో లక్ష్మి నరసింహ స్వామి తిరుణాల బుధవారం వైభవంగా నిర్వహించారు. గ్రామాల ప్రజలు చాందిని బండ్లను విద్యుత్ దీపాలతో అలంకరించి మొక్కులు తీర్చుకున్నారు. కొలాటలు, భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. బుధవారం తెల్లవారుజామున లక్ష్మి నరసింహ స్వామిని ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

విద్యార్థులకు పరీక్షల మెటీరియల్ అందజేస్తున్న ప్రిన్సిపల్ రేఖ

కష్టపడి చదివితే మంచి భవిష్యత్తు

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

పది, ఇంటర్ తరగతుల్లో విద్యార్థులు కష్టపడి చదివితే మంచి భవిష్యత్తు ఉంటుందని ఎపి మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ రేఖ పేర్కొన్నారు. గురువారం మోడల్ స్కూల్లో ఇంటర్ విద్యార్థుల వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ 2015 నుంచి ఎపి మోడల్ కాలేజీలు మంచి ఫలితాలు సాధించి ట్రిపుల్ ఐటిలో ఇంజినీరింగ్ చదువుతున్నారని అన్నారు. అగ్రికల్చర్, హర్టికల్చర్ కోర్సుల్లో మంచి ఫలితాలు సాధించి ఎంతోమంది ఉద్యోగాలు సంపాదించాలని తెలిపారు. ఈ ఏడాది కూడా పది, ఇంటర్మీడియట్ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించి కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని ఆమె సూచించారు. అనంతరం విద్యార్థులకు ప్రిన్సిపల్ పరీక్ష మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రాజ్‌కుమార్, అధ్యాపకులు శివశంకర్‌రెడ్డి, జమ్రుద్ బేగం, సుజాతమ్మ, శ్రీకళ, నిత్య పూజయా, సుధాకర్, శ్రీనివాసులు, మురళి నాయక్, ఆసిఫా భాను, సుమియా, భారతి, అరుణ్ కుమారి, పీడీ సోమశేఖర్ నాయక్, ఉమామహేశ్వరి, సుధీర్, రసూల్ పాల్గొన్నారు.

నర్సరీ యాజమాన్యంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కెవికె శాస్త్రవేత్తలు

నర్సరీ మొక్కల పెంపకంపై అవగాహన

ప్రజాశక్తి-కలికిరి

నర్సరీ నర్సరీ మొక్కల పెంపకం పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం కలికిరి కృషి విజ్ఞాన కేంద్రంలో శాస్త్రవేత్తలు నిర్వహించారు. గురువారం తిరుపతి ఎస్‌వి వ్యవసాయ కళాశాల అగ్రికల్చర్ బిఎస్‌సి ద్వితీయ సంవత్సరం జోనల్ అగ్రికల్చర్ టూర్‌లో భాగంగా కృషి విజ్ఞాన కేంద్రాన్ని సందర్శించారు. విద్యార్థులకు మామిడి, నర్సరీ మొక్కలు, నిమ్మ, వివిధ పూల నారు, కూరగాయల నారు పెంపకం గూర్చి ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసులు వివరించారు. విద్యార్థులు కెవికె నర్సరీని సందర్శించారు. వివిధ జాతుల కోళ్లను గూర్చి, ఆర్టిఫీషియల్ ఎగ్‌ఇంకుబెటర్, వర్మికొంపోస్ట్, అజోల్ల గూర్చి పశువైద్య శాస్త్రవేత్త వివరిచారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ కళాశాల ఉపాధ్యాయులు అరుణశ్రీ, సంతోష్, ఎఆర్.నిర్మల్ కుమార్ పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE : RAJAMPETA

I.A.NO: 398 OF 2021 IN
O.S.NO: 227 0F 2021

KATARU LAKSHMI REDDY, Son of Kataru Gangi Reddy, Hindu, aged about 76 years, Senior Citizen, residing at Door No: C40-59-2, Mutha rasu Palli, H/o china Chowk, Kadapa city & District & 5 OTHERS.

...Petitioners/Plaintiffs

Vs

KRISHNA VENI, Wife of Ananda Reddy, Daughter of C.NarayanaReddy, Hindu, aged about 40 years, Resident of Hyderabad now residing at opp RTC bus stand, Yerraballi,Rajampeta Town, Kadapa District.

...Respondent/Defendant No.22

NOTICE To RESPONDENT/DEFENDANT NO: 22 UNDER ORDER 39 RULE 1 C.P.C

Where as the Petitioners/Plaintiffs here in filed the suit for partition and separate possession in respect of suit schedule Properties and further filed the I.A.No: 398 of 2021 from alienating the said properties and you being Respondent/ Defendant No: 22 and the said I.A/suit stand posted on 27-03-2023 for your appearance therefore you being the Respondent/Defendant No: 22 here by instructed to appear before the Hon'ble court on 27-03-2023 AT 10-30 A.MSharp at 10-30 A.M sharp personally or through an Advocate, failing which the matter will bedecide as Ex-parte.

//By Order of the Hon'ble Court//
(S.MD.KHALEEL GHOUSE & P. ABBAS KHAN)
Advocates For Petitioners/Plaintiffs

విద్యార్థులకు బకెట్లు పంపిణీ

గాలివీడు : స్థానిక బిసి బాలికల వసతి గృహ విద్యార్థినిలకు తెలుగు ఉపాధ్యాయుడు ప్రసాద్ రెడ్డి బకెట్లు, మగ్గులను అందజేశారు. చిన్న చిన్న సమస్యల రాకుడదనే ఉద్దేశంతోనే సొంత ఖర్చులతో బకెట్లు, మగ్గులను అందించినట్లు ఆయన తెలిపారు.

అధికారంలోకి రాగానే ఇస్లామిక్ బ్యాంక్ ఏర్పాటు

ముస్లిముల ముఖాముఖిలో నారా లోకేష్ వెల్లడి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే ఇస్లామిక్ బ్యాంక్ ఏర్పాటు చేస్తామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ వెల్లడించారు. మదనపల్లి నియోజకవర్గంలో జరుగుతున్న యువగళం పాదయాత్రలో భాగంగా కొత్తవారిపల్లి పంచాయతీలో గురువారం ముస్లిం మైనారిటీలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ముస్లిం మైనార్టీలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా నారా లోకేష్ మాట్లాడుతూ ముస్లిం మైనారిటీ ఓట్లతో గద్దెనెక్కిన సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలను తుంగలో తొక్కారన్నారు. పథకాలలో కోత విధించడమే కాకుండా,అడ్డగోలు నిబంధనలతో ఉన్న పథకాలను ఎవరికి వర్తించడం లేదన్నారు. ముఖ్యంగా దూల్హన్ పథకం కింద గత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముస్లింలకు పెళ్లి ఖర్చులకుగాను రూ.50 వేలు ఇచ్చే వారని, దానిని ప్రస్తుత ప్రభుత్వం రూ.లక్షకు పెంచిందేగాని నాలుగేళ్ల కాలంలో ఏ ఒక్కరికి అందజేసిన పాపాన పోలేదన్నారు. మదనపల్లె జిల్లా చేయకపోగా షాదీ మహల్ నిర్మాణం, ఉర్దూ డిగ్రీ కళాశాల, మైనార్టీ కార్పొరేషన్ నిధులు కేటాయింపులను గాలికి వదిలేసిందన్నారు. ఉపముఖ్యమంత్రి, మదనపల్లి ఎమ్మెల్యేలు ముస్లిం మైనార్టీలే అయినప్పటికీ మైనార్టీల సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. టిడిపి సానుభూతిపరులని చాలామందిపై అక్రమ కేసులు బనాయించడం, పథకాలు నిలిపివేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి దొమ్మలపాటి రమేష్, ముస్లిం మైనార్టీ రాష్ట్ర నాయకులు ఎస్ఎంరఫీ, ఎస్ఎ.మస్తాన్, పఠాన్ ఖాదర్ ఖాన్, దొమ్మలపాటి యశ్వశ్వి రాజ్, రాటకొండ బాబురెడ్డి, దాదు, సికిందర్, నిస్సార్ అహ్మద్, తాజ్ బాషా, ఎండి.రఫీ, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీలతో మాట్లాడుతున్న లోకేష్

మహిళల ఆరోగ్యంపై అవగాహన సదస్సు

కలికిరి : అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్

ప్రజాశక్తి-కలికిరి

మహిళల ఆరోగ్యం పై అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్‌వి.సత్యనారాయణ తెలిపారు. కలికిరి ఇంజినీరింగ్ కళాశాలలో మహిళా దినోత్సవ కార్యక్రమం ప్రిన్సిపల్ సత్యనారాయణ ఆదేశాల మేరకు ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.అపర్ణ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు, ఆరోగ్య అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సత్యనారాయణ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో అన్ని రంగాలలో మహిళలు ముందుండి అభివృద్ధి చేస్తున్నారని మహిళ మనోధైర్యాన్ని కొనియాడారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ గిరిజా కుమారి మాట్లాడుతూ మహిళల ఆరోగ్యాన్ని వాళ్ళు పాటించవలసిన ఆరోగ్య సూత్రాలను వివరించారు. విద్యార్థులు తమ తమ అభిప్రాయాలను మహిళల పట్ల ఉన్న గౌరవాన్ని పద్యపాట రూపంలో వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ సరిత, అధ్యాపక సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వాలంటరీ విద్యార్థులు పాల్గొన్నారు. **పీలేరు :** మహిళలు అన్ని రంగాల్లోనూ రాణిస్తూ పురుషులతో సమానంగా ముందుండాలని వాసవి ఇంటర్నేషనల్ క్లబ్స్ అధ్యక్షురాలు పాలకుర్తి గాయత్రి తెలిపారు. స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో పీలేరు వాసవి క్లబ్ గ్రేటర్, వాసవి కపుల్స్ క్లబ్ సంయుక్తంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని విజయం కార్యక్రమంలో భాగంగా 75 మంది మహిళా వాసవియన్స్‌ను సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా వైస్ గవర్నర్ సోమిశెట్టి సురేష్ బాబు, ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ పామిడి నాగరాజా, జోన్ చైర్ పర్సన్ పామిడి జయచంద్ర, గ్రేటర్ క్లబ్ ప్రెసిడెంట్ జూటూరు అరవింద్, సెక్రెటరీ ఆమూరి శివఫణి, ట్రెజరర్ కొత్త మాసి గోవర్ధన్, కపుల్స్ ప్రెసిడెంట్ ఆమూరి మహీధర్, సెక్రెటరీ వెంకట సురేష్, ట్రెజరర్ ఆమూరి శంకర్, కపుల్స్ క్లబ్ చార్టెడ్ ప్రెసిడెంట్ గ్రందే నర్సింహులు, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాలు సురక్షితం

ప్రజాశక్తి-కలకడ

తల్లి బిడ్డ క్షేమంగా ఉండాలంటే సురక్షిత ప్రసవాల కోసం ప్రభుత్వ వైద్యశాలల్లోనే కాన్పులు చేయించుకోవాలని వైద్యాధికారి ఎంవి.కిషోర్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభయాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభయాన్ కార్యక్రమము గర్భవతులందరికీ ఒక వరం లాంటిదని అన్నారు. గర్భిణులు సక్రమమైన పద్ధతులలో వైద్య పరీక్షలు తీసుకోవడం వలన మాతృ శిశు మరణాలను అరికట్టవచ్చునని వారు తెలియజేశారు. సకాలంలో టీకాలు, రక్త పరీక్షలు చేసుకొనుటవలన వారి ఆరోగ్యం మెరుగు పడుతుందని పేర్కొన్నారు. 36 మంది గర్భిణులు హాజరు కాగా వారిలో కష్టతరమైన 11మందిని గుర్తించి మరిన్ని పరీక్షలు నిమిత్తమై ఉన్నత స్థాయి వైద్యశాలలకు రెఫర్ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారి జవహర్ బాబు, ఎంపిహెచ్ఒజి జయరామయ్య, పిహెచ్ఎన్ సుబ్బరత్నమ్మ, సూపర్వైజర్ ముజీబ్ భాష, రెడ్డమ్మ, స్టాఫ్ నర్స్ భారతమ్మ, ల్యాబ్ టెక్నీషియన్, జమీల్అహ్మద్, గణాంకఅధికారి షేక్ ఇస్మాయిల్, ఫార్మసిస్ట్ షరీఫ్ బాషా, గోపికృష్ణ, రాజ సులోచన, కనకమ్మ, అశ్విని, ఆరోగ్య కార్యకర్తలు శ్రీలక్ష్మి, వరలక్ష్మి, వాణి, ఎఫ్ఎన్ఒ అలివేలు మంగ భాయి పాల్గొన్నారు. **కలకడ :** గర్భిణులు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని వైద్యాధికారి మల్లికార్జున తెలిపారు. మండల కేంద్రమైన కలకడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు వైద్య సేవలు అందించారు. పదహారు మంది గర్భిణులను పరీక్షించినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెల్త్‌ఎడ్యుకేటర్ రాజమ్మ, వెంకటే శ్వరరావు, స్టాఫ్‌నర్స్ భాగ్యలక్ష్మి, సిహెచ్ఒ ప్రత్యూష పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డాక్టర్ కిషోర్ కుమార్‌రెడ్డి

హనీఫ్ టీమ్‌తో నారా లోకేష్, నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి

యువగళం పాదయాత్ర విజయవంతం

- టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి-కలికిరి

నియోజకవర్గంలో నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర విజయవంతమైందని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి తెలిపారు. నారా లోకేష్ ప్రతిష్టాత్మకంగా కుప్పం నుండి ఇచ్ఛాపురం వరకు నాలుగు వేల కిలోమీటర్లు, నాలుగు వందల రోజులు సుదీర్ఘంగా చేపట్టిన పాదయాత్రలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేశారన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారాలోకేష్ చేపట్టిన బిసి సదస్సు, మైనార్టీలతో ములాఖత్, కార్యక్రమాల్ని జయప్రదం చేసి, అంతులేని అభిమానం, అవధుల్లేని ఆదరణ చూపించి నియోజకవర్గ పాదయాత్ర జన ప్రభంజనంగా కోన సాగిందని అన్నారు. ఈ పాదయాత్రకు నియోజకవర్గ పరిధిలోని పీలేరు, కలికిరి, కలకడ, గుఱ్ఱం కొండ, కెవిపల్లి, వాల్మీకిపురం మండలాల నుండి క్షేత్ర స్థాయిలో పాల్గొని విజయవంతం చేశారని అన్నారు. ముఖ్యంగా ముస్లిం మైనార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హనీఫ్ ఆధ్వర్యంలో పీలేరు నుండి సిటిఎం వరకు నల్లారికి, లోకేష్‌కు అండగా పాదయాత్ర లో పాల్గొనడం పట్ల అభినందనలు తెలిపారు. అండగా నిలిచిన ప్రతి ఒక్కరికి పార్టీ అండగా ఉంటుందని తెలిపారు.

వైసిపికి గృహ సారథులే కీలకం

ప్రజాశక్తి-పుల్లంపేట

చిత్తశుద్ధితో పనిచేస్తే అధికారం మళ్ళీ మనదేనని సచివాలయాల కన్వీనర్లు, గృహసారథుల, వాలంటీర్ల సమన్వయ సమావేశంలో ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు సమిష్టిగా చిత్తశుద్ధితో పనిచేయాలని, రాబోయే ప్రభుత్వం మళ్ళీ మనదేనని అన్నారు. గురువారం మండల వైసిపి కార్యాలయ ఆవరణలో జరిగిన మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల, వాలంటీర్ల సమన్వయ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఇప్పటినుంచే ఎన్నికలకు సిద్ధమయ్యేందుకు, పార్టీ పరిపుష్టికి గృహ సారధులు, సచివాలయ కన్వీనర్ల వ్యవస్థను ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రూపొందించారని తెలిపారు. కన్వీనర్లు వాలంటీర్లపై పెత్తనం చేయకుండా గృహ సారధులతో కలిపి పార్టీని బలోపేతం చేయాలని, ప్రభుత్వ పథకాలు క్షేత్రస్థాయికి అందేలా చూడాల్సిన బాధ్యత మీపైనే ఉందన్నారు. ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాల పట్ల అత్యధిక మంది ప్రజలు సంతృప్తిగా ఉన్నారన్నారు. సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బాధ్యతయుతంగా తీసుకెళ్లి పార్టీ పటిష్టతకు కృషి చేయాలన్నారు. అర్హులైన లబ్దిదారులను గుర్తించి వారికి పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డి, నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు పులి సునీల్ కుమార్, మండల సచివాలయాల కన్వీనర్ నాగిరెడ్డి హరినాథ రెడ్డి, జడ్‌పిటిసి రామనాథం, వైస్ ఎంపిపి సారథి, విజయ్‌కుమార్ రెడ్డి, శంకర్‌రెడ్డి, పుల్లంపేట సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులురెడ్డి, ముస్తాక్, నలినికాంత్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్లు, గృహసారధులు, వాలంటీర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముగిసిన జెఎన్‌టియు చెస్ శిక్షణ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

గత మూడు రోజులుగా అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో జరుగుతున్న జెఎన్‌టియు చెస్ శిక్షణ శిబిరం గురువారంతో ముగిసింది. గత ఏడాది డిసెంబర్‌లో జరిగిన జెఎన్‌టియు ఇంట్రా యూనివర్సిటీ చెస్ ఎంపికలలో తమ కళాశాల నుంచి ఎంపికైన ఆరుమంది విద్యార్థులకు గత మూడు రోజులుగా కళాశాలలో చెస్ శిక్షణా శిబిరం ముగిసిందని కళాశాల వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి తెలిపారు. ఎంపికైన ఆరు మంది విద్యార్థులకు గత మూడు రోజులుగా తమ కళాశాలలో చెస్ శిక్షణా శిబిరం నిర్వహించగా విద్యార్థులు ఈనెల 10న సౌత్‌జోన్ ఇంట్రా యూనివర్సిటీ ఎస్ఆర్ఎం ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, చెన్నైలో జరగబోయే చెస్ పోటీల్లో విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. పోటీలలో పాల్గొనే విద్యార్థులకు యూనివర్సిటీ క్రీడా దుస్తులను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.మల్లికార్జునరావు, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ బి.నాగముని, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ఏర్పాటు హర్షణీయం

ప్రజాశక్తి-ములకలచెరువు

మండలంలోని పాత ములకలచెరువుకు గత కొన్నేళ్లుగా రోడ్డు లేక గ్రామ ప్రజలు వర్షాకాలంలో గ్రామం నుండి ప్రధాన రహదారిలో ఉన్న మండల కేంద్రానికి వెళ్లాలంటే చాలా కష్టంగా ఉండేది. అడుగడుగునా గుంతలు, ఆపై వర్షపు నీరు నిలిచేది. వాహనాలు ముందుకు వెళ్లలేని పరిస్థితి. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డి చొరవతో గ్రామానికి గురువారం తారు రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల తర్వాత మా గ్రామానికి రోడ్డు పనులు చేపట్టడం హర్షణీయమన్నారు. ఎన్నో ఏళ్లుగా ప్రజలు కంటున్న కల ఎమ్మెల్యే తీర్చారని గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. అతనికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటాం అని గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

క్రీడల్లో ప్రతిభ చాటిన 'మిట్స్' విద్యార్థులు

ప్రజాశక్తి-కురబలకోట

మండల పరిధిలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు 11వ జెఎన్‌టియు క్రీడల్లో ప్రతిభ కనపరిచినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. గూడూరు ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన పోటీలలో బాస్కెట్‌బాల్ పురుషుల విజేతలు, మహిళల టెన్నికాయిట్ డబుల్స్ విజేత, మహిళల సింగిల్స్ టెన్నికాయిట్ విజేతలుగా నిలిచినట్లు ఆయన తెలిపారు. జెఎన్‌టియు అనంతపురంకు అనుబంధంగా ఉన్న 67 కళాశాలల నుంచి సుమారు రెండు వేల మంది విద్యార్థులు పాల్గొన్నారని, అందులో తమ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనపరచినట్లు తెలిపారు. తమ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా ప్రతిభ చాటడం హర్షణీయమన్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడల్లో కూడా నైపుణ్యం ప్రదర్శించి పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థులను కళాశాల కరెస్పాండెట్ డాక్టర్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, ఫిసికల్ డైరెక్టర్ దామోదరన్ అభినందనలు తెలిపారు.



ప్రతిభ చాటిన విద్యార్థులతో ప్రిన్సిపల్ యువరాజ్, అధ్యాపకులు

ప్లాస్టిక్ నిషేధం పై ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థినిలు

ప్లాస్టిక్‌ను నిషేధిద్దాం

ప్రజాశక్తి-గాలివీడు

ప్లాస్టిక్‌ను నిషేదిద్దా..పర్యావరణాన్ని కాపాడుకుందాం అనే నినాదంతో గురువారం బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినిలతో పాఠశాల నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఒ.నిర్మల మాట్లాడుతూ ప్రతి వ్యక్తి సంవత్సరానికి నాలుగు కేజీల ప్లాస్టిక్‌ను వాడుతున్నారని, ఈ ప్లాస్టిక్ ద్వారా పర్యావరణానికి ఎంతో హాని జరుగుతుందన్నారు. 2019లో కేంద్ర ప్రభుత్వం జులై 1వ తేదీన 16 ప్లాస్టిక్ వస్తువులను నిషేధం విధించిందన్నారు. ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్మన్ కుందా లక్ష్మీ ప్రసన్న, ఉపాధ్యాయులు హేమలత, వసుంధర సౌజన్య, నారాయణమ్మ, పిఇటి కరుణాకర్, భాస్కర్, విద్యార్థినిలు మస్తానీ, నైనాశ్రీ, లక్ష్మీరాణి, కీర్తి, శిరీష, హారిక, మౌనిక, ఆస్మ, ఆఫీఫాలు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేసిన 108 సిబ్బంది

ప్రజాశక్తి-ములకలచెరువు

గత ఏడాది మండలంలోని బురకాయల కోట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ములకలచెరువు 108లో ఇఎంటిగా పనిచేస్తున్న రాజేష్ మృతి చెందిన విషయం విధితమే. రాజేష్ కుటుంబ సభ్యులకు ఉమ్మడి చిత్తూరు జిల్లా 108 యూనియన్ తరపున లక్ష రూపాయలు ఆర్థిక సాయం గురువారం అందజేశారు. తమలో ఒక్కడిగా ఉంటూ విధుల్లో భాగంగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం బాధకరం అన్నారు. వారి కుటుంబానికి తమ వంతు సాయంగా లక్ష రూపాయలు ఆర్థిక అందజేశామన్నారు. విధుల్లో ప్రజలకు సేవ చేసే క్రమంలో జరిగిన ప్రమాదం తమకు బాధ కలిగించిందన్నారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. ఆర్థిక సాయం చేసిన వారిలో యూనియన్ నాయకులు శివకుమార్, రసూల్, గోపినాథ్, చందంద్రబాబు, గణేష్, సాంబ, రాజు, చిరంజీవి ఉన్నారు.

వేలం నిర్వహిస్తున్న అధికారులు

వేలంపాట ఆదాయం రూ.34.37 లక్షలు

ప్రజాశక్తి-కలకడ

మండల కేంద్రమైన కలకడ సచివాలయానికి వేలం పాటల ద్వారా రూ.34.37లక్షలు ఆదాయం వచ్చినట్లు ఎంపిడిఒ సిహెచ్.నారాయణ తెలిపారు. గురువారం స్థానిక సచివాలయంలో డిఎల్‌పిఒ, స్థానిక ఎంపిడిఒ సిహెచ్.నారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన వేలం పాటలో టమోటా మార్కెట్‌ను అత్తరు ఆరిఫుల్లా కుమారుడు షఫీవుల్లా రూ.18.20 లక్షలకు కైవసం చేసుకున్నాడని, వారపుసంతను ఎంఎస్.అక్రమ్ బాషా రూ.14.15 లక్షలకు వేలంపాడి సొంతం చేసుకున్నట్లు తెలిపారు. ప్రయివేట్ బస్టాండ్‌ను ఖాదర్‌వలీ రూ.1.63 లక్షలకు, జంతువధశాలను డి.జిలానిబాషా రూ.2,500 లకు వేలం ద్వారా తన సొంతం చేసుకున్నారని పేర్కొన్నారు. పంచాయతీ గదులు వేలం వేయగా మొదటి గది రూ.16వేలకు పాడి సాదిక్ బాషా, రెండవ గదిని రూ.10,400లకు, మూడవ గదిని మాసూమ్ సాహెబ్ రూ.10,300 లకు వేలం ద్వారా సొంతం చేసుకున్నారని తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి-రామాపురం

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధించవచ్చునని కృషిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు తెలిపారు. మండలంలోని రాచపల్లి పంచాయతి కొవ్వూరువాండ్లపల్లి చెందిన రామాంజిరెడ్డి పొలంలో ప్రకృతి వ్యవసాయపై క్షేత్ర దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ కృషి విజ్ఞాన కేంద్రాల ద్వారా ప్రకృతి వ్యవసాయాన్ని పెంపొందించడం అనే ఆంశంపై రైతులకు అవగాహన సదస్సులు, విజ్ఞానయాత్రలు, శిక్షణా కార్యక్రమాలు, క్షేత్ర ప్రదర్శనలు నిర్వహించినట్లు తెలిపారు. కడప ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త సి.ప్రత్యూష మాట్లాడుతూ ఎరువుల యాజమాన్యంలో పాటించ వలసిన మెళకువలు, భుసార పరిక్షల ఆవశ్యకతను గురించి వివరించారు. వ్యవసాయ అధికారి నాగమణి మాట్లాడుతూ ప్రకృతి వ్యవ సాయం అనుకరించడానికి రైతులు ఉత్సాహం చూపాలని, దీర్ఘకాలిక దిగుబడితో లాభాలు పొందవచ్చని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెట్‌లో డిమాండ్ పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో రామిరెడ్డి, ధర్మరెడ్డి, నాగరాజు, శ్రీదేవి, రైతులు పాల్గొన్నారు.

ఉజ్వల భవిష్యత్తుకు పునాది వేసుకోవాలి

ప్రజాశక్తి-గాలివీడు

ఉజ్వల భవిష్యత్తుకు విద్యార్థులే పునాది వేసుకోవాలని గౌతమ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ సైజు థామస్ పేర్కొన్నారు. గురువారం సాయంత్రం పాఠశాల ప్రాంగణంలో పాఠశాల వార్షికోత్సవ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల ప్రారంభం నుంచి నేటి వరకు ఉన్నతమైన ప్రమాణాలతో విద్యను అందించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కృషి వల్ల విద్యార్థులు మంచి స్థానాలకు చేరుకుంటున్నారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపల్, డైరెక్టర్ సింటో ఇమ్మానుయేలు, ఉపాధ్యాయులు తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

పేకాట స్థావరంపై పోలీసుల దాడులు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పట్టణంలోని పిటిఎం రోడ్డులోని నిర్మాణ భవనంలో పేకాట ఆడుతున్న నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ రామ్మోహన్ వివరాల మేరకు.. గుట్టుచప్పుడు కాకుండా పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు తమ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించామన్నారు. ఇందులో భాగంగా నలుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.1,52,310 నగదును సీజ్ చేసినట్లు తెలిపారు. పట్టుబడ్డ వారందరూ బి.కొత్తకోట పట్టణానికి చెందిన వ్యక్తులేనన్నారు. గురువారం నిందితులను కోర్టులో హాజరు పరిచామన్నారు. ఈ దాడిలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నట్లు ఎస్ఐ తెలిపారు.